ప్రజాశక్తి
బుధవారం 20 ఆగస్టు 2025 | 5 | విజయనగరం

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2025 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు కోరుతున్నట్లు డిఇఒ మాణిక్యం నాయుడు తెలిపారు. జిల్లాలో గల ప్రాథమిక / ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాల / గవర్నమెంట్ డైట్, ఇతర మేనేజ్ మెంట్స్ (ప్రైవేటు యాజమాన్యం మినహా) పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, హెచ్ఎంలు నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ప్రతిపాదనలు కోరుతున్నట్లు తెలిపారు. పదేళ్ల కనీస ప్రభుత్వ ఉపాధ్యాయ సేవలు పూర్తి చేసిన వారి అర్హతలను బట్టి ప్రతిపాదనలు ఈనెల 20 నుంచి 28లోగా డిప్యూటీ డిఇఒ, ఎంఇఒ కార్యాలయాలకు అందజేయాలని కోరారు.

7వేల మందికి పింఛన్ల కోత

- సదరం వెరిఫికేషన్ పేరిట వాత
- నోటీసులు అందజేతతో వికలాంగులు లబోదిబో
- దీర్ఘకాలిక రోగులకు పింఛను మొత్తం తగ్గింపు
- దరఖాస్తు చేసుకోవచ్చునంటున్న అధికారులు

జామిలో దరఖాస్తు ఇచ్చేందుకు ఎంపిడిఓ కార్యాలయానికి వచ్చిన వికలాంగులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

- జామి మండలం పావాడ గ్రామానికి చెందిన చొక్కాకుల పైడమ్మ 89శాతం వికలాంగురాలు. 2010 నుంచి పింఛను అందుకుంటోంది. తాజాగా సదరం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్‌లో వైద్యులు 40శాతం కంటే ఉందని చెప్పి పింఛను తొలగిస్తున్నట్లు నోటీసు ఇచ్చారు.

- విజయనగరంలోని 23వ డివిజన్‌కు చెందిన దంతులూరి వెంకట సత్యనారాయణరాజు పుట్టిన ఏడాదికే పోలియో బారిన పడ్డారు. 2015లో 50శాతం వికలాంగత్వం ఉన్నట్లు వైద్యులు సర్టిఫికెట్ ఇచ్చారు. తాజా వెరిఫికేషన్‌లో 40శాతం కంటే తక్కువ ఉందంటూ నోటీసు ఇచ్చారు. సాధారణంగా పోలియో బారిన పడిన వారికి వికలాంగత్వం తగ్గే అవకాశం లేదు.

- గజపతినగరం మండలం పాతబగ్గాం గ్రామానికి చెందిన సంగంరెడ్డి చల్లాయమ్మ గత పదేళ్లగా పింఛను తీసుకుంటోంది. గతంలో 45 శాతం అంధత్వ వికలాంగత్వం ఉంది. తాజా వెరిఫికేషన్‌లో 25శాతం వేయడంతో పింఛనుకు కోతపడింది.

ఇలా ఒకరో ఇద్దరో కాదు...ఏకంగా జిల్లాలో 7వేల మందికి ప్రభుత్వ ఆదేశాలకు అధికారులు పింఛన్లకు అనర్హులంటూ నోటీసులు జారీ చేశారు. వికలాంగులు, వృద్ధులు, వితంతువులకు సామాజిక భద్రతగా ఉన్న పింఛన్లను తొలగించేందుకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. తొలుత అధిక మొత్తం చెల్లిస్తున్న వికలాంగుల పింఛన్లను తగ్గించాలని భావించిన ప్రభుత్వం జిల్లాలో భారీగా కోతపెట్టింది. సదరం సర్టిఫికెట్ల పరిశీలన పేరిట 8నెలలుగా ఆస్పత్రుల చుట్టూ తిప్పించి చివరికి పింఛన్లకు అనర్హులంటూ జిల్లాలో సుమారు 7వేల మందికి నోటీసులు జారీ చేసింది. 40శాతం తక్కువ వికలాంగత్వం ఉందని పింఛను తొలగిస్తున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. దీంతో వికలాంగులంతా లబోదిబోమంటున్నారు.

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పింఛను మొత్తాన్ని రూ.3వేలు నుంచి రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు, దీర్ఘకాలిక రోగులకు 6వేలు నుంచి రూ.15వేలకు పెంచింది. దీంతో వారంతా ఆనందం వ్యక్తం చేశారు. అయితే తాజాగా సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరిట వికలాంగుల పింఛన్లను తొలగించాలని నిర్ణయించింది. అందులో భాగంగా వికలాంగులంతా మరోసారి వైద్యుల వద్దకు వెళ్లి సదరం ధ్రువీకరణ చేయించుకోవాలని షరతు పెట్టింది. వికలాంగత్వం ఎంత ఉందో వైద్యులతో ధృవీకరించి పర్సంటేజీతో సర్టిఫికెట్‌ను తీసుకుని రావాలని కొత్త నిబంధనలను పెట్టింది. దీంతో గత 20 ఏళ్లుగా పింఛను తీసుకుంటున్న వికలాంగులంతా ఒక్కసారిగా సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఆస్పత్రుల పరుగులు పెట్టారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే వైద్యులకు పింఛన్లలో వీలైనంత ఎక్కువ మందికి కోతపెట్టాలని మౌఖిక ఆదేశాలివ్వడంతో వైద్యులు వైకల్య శాతం తగ్గించి ధ్రువపత్రాలు ఇచ్చారు. ఇప్పుడు వైకల్యం శాతం 40 కంటే తగ్గిందన్న సాకుతో చాలా మంది పింఛన్లను తొలగిస్తూ నోటీసులు అందజేశారు. దీంతో వికలాంగులు ఏం చేయాలో తెలియక మళ్లీ సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

సదరన్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పేరిట ఈ ఏడాది జనవరి 20 నుంచి జిల్లా వ్యాప్తంగా ఉన్న 36,412 వికలాంగ పింఛనుదారులకు సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ చేపట్టారు. నేటికీ ఆ ప్రక్రియ కొనసాగుతోంది. జులై 31 నాటికి సదరన్ వెరిఫికేషన్ చేసిన వారిలో 6,770 మందికి నోటీసులు జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే చాలా మందికి అందజేశారు. గ్రామస్థాయిలో వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా నోటీసులను తమ పరిధిలో గల వికలాంగులకు అందజేస్తున్నారు. దీంతో వికలాంగులంతా ఆందోళన చెందుతున్నారు. సచివాలయాలకు, ఎంపిడిఒ కార్యాలయాలకు వెళ్లి తమకు పింఛన్లు కొనసాగించాలని కోరుతున్నారు. మరోవైపు ఈ నెలాఖరు వరకు సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగుతుండటంతో ఇది పూర్తయితే మరికొందరికి నోటీసులు అందజేసే అవకాశముంది.

రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేయొచ్చు

పింఛన్లకు అనర్హులంటూ నోటీసులు అందుకున్న వికలాంగులు మండల స్థాయిలో ఎంపిడిఒలను, మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో కమిషనర్లకు దరఖాస్తు చేయవచ్చును. అర్హులకు పింఛన్లు తొలగించబోం. సదరం వెరిఫికేషన్‌లో ఎవరికైతే పర్సంటేజ్ తక్కువ వచ్చి పెన్షన్ తగ్గుతుందో, లేదా పూర్తిగా పోతుందో నోటీసుతో పాటు పాత సదరం సర్టిఫికెట్, కొత్త సదరం సర్టిఫికెట్ తో పాటుగా ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలను జత చేస్తూ అధికారులకు నోటీసులందిన 30 రోజుల్లోగా దరఖాస్తు అందజేయాలి.

శ్రీనివాస పాణి, డిఆర్‌డిఎ పీడీ

రూ.280 కోట్లతో కరకట్టల నిర్మాణానికి ప్రతిపాదన

- కలెక్టర్ బిఆర్ అంబేద్కర్
- నాగావళి నది పరీవాహక ప్రాంతంలో విస్తృత పర్యటన
- వర్షాల ప్రభావం, పంటల పరిస్థితిపై ఆరా

వంగర: మడ్డువలస ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-వంగర, సంతకవిటి, రేగిడి

గత నాలుగు రోజులుగా జిల్లాలో కురిసిన భారీ వర్షాల అనంతరం తలెత్తిన పరిస్థితులను తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నాగావళి నది పరీవాహక ప్రాంతంలో మంగళవారం సుడిగాలి పర్యటన చేశారు. వంగర, సంతకవిటి, రేగిడి మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. పంటల స్థితిగతులు, నది సమీప గ్రామాల్లోని పరిస్థితులను ఆయన పరిశీలించారు. మడ్డువలస రిజర్వాయర్ ను సందర్శించారు. ముంపు నివారణకు జిల్లాలో 28 కరకట్టల నిర్మాణానికి ప్రతిపాదన చేసినట్లు తెలిపారు.

రేగిడి మండలం బొడ్డవలస గ్రామం వద్ద నాగావళి నదిని కలెక్టర్ పరిశీలించారు. పంప్ హౌస్ ద్వారా చుట్టుపక్కల గ్రామాలకు అందుతున్న తాగునీటి సరఫరాను తెలుసుకున్నారు. నది ప్రవాహ ఉధృతిని పరిశీలించారు. సంతకవిటి మండలం కెఆర్ పురం వద్ద నాగావళి నదిని, చుట్టుపక్కల పంట పొలాలను, నీట మునిగిన పంట చేలను పరిశీలించారు. గ్రామస్తులతో మాటామంతి జరిపి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎరువుల సరఫరాపై వ్యవసాయ అధికారులను ప్రశ్నించారు. గ్రామానికి రక్షణగా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి, రంగారాయపురం గ్రామానికి రహదారి మంజూరుకు కలెక్టర్ హామీ ఇచ్చారు. సుమారు రూ.280 కోట్లతో 28 కరకట్టల నిర్మాణానికి పంపించిన ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఇవి మంజూరు అయితే చాలా గ్రామాలకు ముంపు సమస్య తొలగిపోతుందని కలెక్టర్ అన్నారు.

రేగిడి: బొడ్డవలస వద్ద నాగావళి నదిని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

వంగర మండలంలోని మడ్డువలస రిజర్వాయర్‌ను కలెక్టర్ సందర్శించారు. రిజర్వాయర్‌లో నీటి చేరిక, విడుదలపై ఆరా తీశారు. రిజర్వాయర్ లో పేరుకుపోయిన గుర్రపు డెక్క నిర్మూలనకు నివారణ మందులు స్ప్రే చేయాలని ఆదేశించారు. రిజర్వాయర్ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్న సమయంలో దిగువ ప్రాంతంలో మత్స్యకారులు నదిలోకి దిగి చేపలు పట్టకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యటనలో చీపురుపల్లి ఇన్చార్జి ఆర్‌డిఒ ఆశయ్య, ఇరిగేషన్ ఎస్ఇ సుధాకర్ బాబు, డ్వామా పీడీ శారదాదేవి, ఆయా మండలాల తాశీల్దారులు, ఒగిడి ఎంపిడిఒ నాగమణి, ఎపిఒ హరినాథ్, ఎపిఎం గోవిందరావు, ఎంఇఒ వరప్రసాదరావు, రైతు సంఘం నాయకులు నారు జనార్దన్ రావు, సర్పంచ్ పట్టాభి, కృష్ణారావు, రమణారావు, పంచాయతీ కార్యదర్శి పోలినాయుడు, ఆర్ఐ కిరణ్ కుమార్, విఆర్ఒ దుర్గారావు పాల్గొన్నారు.

వరద గట్లు నిర్మించాలని కలెక్టర్ కు వినతి

రేగిడి మండలం సంకిలి నాగావళి నది శివాలయం ఎగువ ప్రాంతం నుంచి రేగిడి వరకు రెండున్నర కిలోమీటర్ల మేర వరద గట్లు నిర్మించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నారు జనార్ధన రావు మంగళవారం వినతి పత్రం అందజేశారు. బ్రిటిష్ కాలం నాటి వరదగట్లు ఆల్పంగా ఉన్నాయని, ఇక్కడ నాగావళి వరదలకు గండి కొడితే 11,600 ఎకరాలు పంట భూములు, వాటి అనుబంధ సాయన్న ఛానల్ పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. రేగిడి మండలంలో కొన్ని గ్రామాలు, సంతకవిటి మండలంలో మరికొన్ని గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉందని కలెక్టర్‌కు వివరించారు. అన్నదాత సుఖీభవ బ్యాంక్ ఖాతాల్లో పడలేదని కలెక్టర్ కు సంకిలి గ్రామ దళిత రైతులు వినతి అందజేశారు. స్పందించిన కలెక్టర్ తక్షణమే తమ పరిష్కరించి అన్నదాత సుఖీభవ అందించేలా తహశీల్దార్ కృష్ణలతకు సూచించారు.

అగ్నివీర్ ఎంపికలో విషాదం

పరుగుపోటీలో ఊపిరి వదిలిన యువకుడు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కాకినాడ జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన అగ్నిపథ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో విషాదం చోటు చేసుకుంది. జిల్లాలోని సంతకవిటి మండలం శ్రీహరినాయుడుపేటకు చెందిన గండ్రేటి సాయికిరణ్ (20) మంగళవారం 16వందల మీటర్ల పరుగుపందెంలో పాల్గొన్నాడు. తోటి యువకులతో కలసి పరుగుపెడుతుండగా ఆయాసం, గుండెనొప్పి రావడంతో ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. వెంటనే అతడిని అంబులెన్సులో స్థానిక ఆస్పత్రికి తరలించారు. సాయంత్రం 5గంటలకు కోలుకొని మిత్రులతో మాట్లాడాడు. అంతలోనే ఎగ ఊపిరి వచ్చి మృతి చెందాడు. అయితే వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు అప్పలనాయుడు, భారతి కన్నీరు మున్నీరయ్యారు.సాయికిరణ్‌కు తల్లిదండ్రులతో పాటు సోదరి శ్రీలేఖ ఉన్నారు. శ్రీకాకుళంలో డిగ్రీ చదువుకున్న సాయికిరణ్ విజయనగరంలో గత ఐదునెలలుగా కోచింగ్ తీసుకుంటున్నాడు. సాయికిరణ్ మృతితో గ్రామంలో విషాదం అలముకుంది.

నోటీసులు అందుకున్న పింఛన్‌దారులు

నగర పాలక సంస్థ కార్యాలయంలో సంప్రదించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వికలాంగుల పింఛనుకు అనర్హత నోటీసులు అందుకున్న వారు తాము అర్హులమని భావించినట్లయితే నగరపాలక సంస్థ కమిషనర్ ను సంప్రదించి, తమ అర్జీని సమర్పించవచ్చని కమిసనర్ నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు తమ అర్జీని పెన్షన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి తదుపరి కార్యాచరణ చేపడతారని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం తమను ఆసుపత్రికి హాజరుకావాలని కోరుతూ మరో నోటీసు జారీ చేస్తారనివివరించారు. ఎప్పుడు ఎక్కడ అనే వివరాలను నోటీసు ద్వారా తమకు తెలియజేస్తారని అన్నారు. మరిన్ని వివరాలకు తమ సమీపంలో గల వార్డు సచివాలయ కార్యదర్శులను సంప్రదించాలని తెలిపారు.

మట్టి విగ్రహాలను మాత్రమే వాడాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 27న వినాయక చవితిని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను మాత్రమే పూజించుకోవడం శ్రేయస్కరం, సాంప్రదాయమని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలు వినియోగించడం మంచిదని చెప్పారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర రసాయనాలతో రూపొందించిన విగ్రహాలు నిమజ్జనం అనంతరం అవి నీటిలో కరగకపోగా, రసాయనాల వల్ల చెరువులో ఉండే జీవజాతి పై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. కావున ఇళ్లల్లో, మండపాల్లో పూజించే విగ్రహాలు కేవలం మట్టితోనే రూపొందించి పూజించుకోవడం పర్యావరణహితమని అన్నారు. ప్రసాద వితరణ కార్యక్రమాల వల్ల పరిసరాల పరిశుభ్రతకు విఘాతం కలిగించరాదని అన్నారు.

మాజీ సైనిక ఉద్యోగులకు లీగల్ సర్వీసెస్ క్లినిక్

మాట్లాడుతున్న న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

మాజీ సైనిక ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఏర్పాటుచ ఏసిన లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను మంగళవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి ఎ.కృష్ణ ప్రసాద్ జిల్లా సైనిక వెల్ఫేర్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనిక ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు న్యాయ సహాయం కోసం ఈ క్లినిక్ ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ అధికారి కెవిఎస్ ప్రసాదరావు, న్యాయవాది ధనుంజయరావు, పారా లీగల్ వాలంటీర్ జి.రమణ, మాజీ సైనిక ఉద్యోగులు పాల్గొన్నారు

ఉత్సాహంగా ఐద్వా జిల్లా మహాసభ

మద్యంపై ఉన్న ప్రేమ మహిళల సమస్యల పరిష్కారంలో లేదు : ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

సభలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రభావతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 9 వ జిల్లా మహాసభ మంగళవారం ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగింది. మహాసభ సందర్భంగా కలెక్టరేట్ వద్దగల జ్యోతిరావు పూలే విగ్రహం నుంచి యూత్ హాస్టల్ వరకు మహిళలు ర్యాలీ నిర్వహించారు. మహాసభలకు గుర్తుగా 9 మంది మహిళలు ఐద్వా జెండాలు చేతపట్టి ర్యాలీకి అగ్రభాగంలో నడిచారు. అనంతరం యూత్ హాస్టల్ లో జరిగిన మహాసభల వేదిక వద్ద ఐద్వా జెండాను రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రభావతి ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు కె.పుణ్యవతి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన పి.ప్రభావతి మాట్లాడారు. రాష్ట్రంలో మహిళల సమస్యలు పరిష్కరించడంలో చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రతి రోజూ 50 మందికి తక్కువ లేకుండా రాష్ట్రంలో లైంగిక వేధింపులు జరుగుతున్నాయన్నారు. నేడు జనాభాకు అనుగుణంగా విస్తారంగా రాష్ట్రంలో మద్యం షాపులను పెంచడం లో ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ అదే జనాభా ప్రాతిపదికన తాగునీరు అందించడంలోను, పేదలకు ఇళ్లు ఇవ్వడంలో, మహిళలకు రుణాలు ఇచ్చి ఆదుకోవడంలో, దాడులను నియంత్రించడంలో, లైంగిక వేధింపులు అరికట్టడంలో కూటమి ప్రభుత్వానికి లేదని దుయ్యబట్టారు. మహిళల హక్కులపై దాడి జరుగుతోందన్నారు. సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయడం లేదన్నారు. మరో వైపు ప్రభుత్వం 18ఏళ్ల దాటిన మహిళల ఖాతాల్లో డబ్బులు వేస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచిత బస్సు అని చెప్పి నేడు కేవలం పల్లె వెలుగు వంటి బస్సులకు మాత్రమే పరిమితం చేసి చేతులు దులుపుకున్నారన్నారు. మరో వైపు మైక్రో ఫైనాన్స్ వేధింపులు తీవ్ర స్థాయిలో ఉన్నాయని, మైక్రో ఫైనాన్స్‌ల నియంత్రణకు చట్టం చేయాలని మహాసభ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. మహిళల హక్కుల కోసం, ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో మహిళలు సమస్యలు పరిష్కారం కోసం మహాసభల్లో నిర్ణయాలు చేసి, భవిష్యత్ లో పెద్ద ఎత్తున పోరాటాలకు మహిళలు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. సభలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.పద్మావతి, జిల్లా ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, వేగోటి లక్ష్మి, జగదాంబ, అర్.హరికృష్ణవేణి పాల్గొన్నారు. అనంతరం కార్యదర్శి నివేదికను జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ ప్రవేశపెట్టగా సభ్యులంతా చర్చించి ఆమోదించారు. సభ ప్రారంభానికి ముందు యువత ప్రదర్శించిన కళారూపాలు అలరించాయి.

కలెక్టరేట్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు, మహిళలు

పలు తీర్మానాలు అమోదం

మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించారు. ఉపాధి హామీకి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని, 200 రోజులు పని, రూ.600 కూలి ఇవ్వాలని, పట్టణ పేదలకు పథకం వర్తింప చేయాలని తీర్మానం చేశారు. మైక్రో ఫైనాన్స్ వేధింపులు నుంచి మహిళలను రక్షించాలని,. డ్వాక్రా మహిళలు సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు.మహిళలపై దాడులను అరికట్టాలని తీర్మానించారు.

అధ్యక్ష,కార్యదర్శులుగా పుణ్యవతి, రమణమ్మ

మహాసభ సందర్భంగా నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కె.పుణ్యవతి, కార్యదర్శిగా పి.రమణమ్మ, సహాయ కార్యదర్శిగా జి.పుణ్యవతి, వేగోటి లక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఆర్.హరికృష్ణవేణి, జిల్లా కమిటీ సభ్యులుగా సిహెచ్ కృష్ణవేణి , జి.అరుణ, డి.కరుణ, ఎం.జగదాంబ ఎన్నికయ్యారు.

'ఓవర్ స్పీడ్' వాహనాలపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలోని బ్లాక్ స్పాట్స్, హైవేలపై, ముఖ్య కూడళ్ల వద్ద విస్తృతంగా తనిఖీలు చేపట్టి 'ఓవర్ స్పీడ్' తో వెళ్లే వాహనాలపై కేసులు నమోదు చేసామని ఎస్‌పి వకుల్‌జిందల్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈనెల 11 నుండి 17 వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా అతివేగంతో వెళ్ళే వాహనాలపై 23 కేసులు నమోదు చేసి, ఈ- చలానాగా రూ.25,665ను విధించామన్నారు. వాహనదారులకు అతివేగంతో వాహనాలు నడపడం వలన కలిగే అనర్ధాలను సంబంధిత అధికార్లు వాహనదారులకు వివరిస్తూ, కౌన్సిలింగ్ నిర్వహించారని తెలిపారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించాలని, తప్పనిసరిగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్స్ ధరించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ ను విజయనగరం, బొబ్బిలి, చీపురుపల్లి డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, జి.భవ్యా రెడ్డి, ఎస్.రాఘవులు పర్యవేక్షించారని తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రబోధ సేవా సమితి -ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఈనెల 16 నుంచి గురజాడ కళాభారతి ఆడిటోరియంలో జరుగుతున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు బుధవారంతో ముగియనున్నాయి. ఇప్పటికే బొబ్బిలి, గజపతినగరం, నెల్లిమర్ల, బొద్దాం తదితర ప్రాంతాల్లో చేసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ముగిశాయని అధ్యక్షులు వి.శంకర్రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి వేదిక వద్ద నుంచి ఉత్సవ ముగింపు ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు.

సాంస్కృతి ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

తోటపల్లి కాలువ పరిశీలన

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

తోటపల్లి కుడి కాలువను తహశీల్దార్ యం.శ్రీను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలువలో నీటి మట్టం పరిశీలన చేశామన్నారు. నీటి ఉధృతి వల్ల ఎక్కడైనా కాలువ గట్లు బలహీన పడ్డట్లు తన దృష్టికి రాలేదని అన్నారు. చింతాడ, రాముడువలస, పక్కి వెళ్లి పరిశీలన చేశామన్నారు. అనంతరం ఆయా సచివాలయాలు పరిశీలించారు. అతని వెంట విఆర్ఒలు ఏ.గౌరీ శంకర్రావు, సిహెచ్ సుధాకర్, చింతాడ పిఎసిఎస్ అధ్యక్షులు కె.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేందుకు విద్యార్థులకు అడ్మిషన్లు నేటి నుండి జరుగుతాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ కేశవ రావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, కెమిస్ట్రీ, ఫిజిక్స్, కంప్యూటర్ ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీ ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కళాశాలకు హాజరైతే ఉచితంగానే రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. తమ కళాశాలలో బిఎ పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, బీకాం జనరల్, బిఎస్‌సి, కెమిస్ట్రీ, బిఎస్‌సి మ్యాథమెటిక్స్ కోర్సులు కళాశాలలో అందిస్తున్నామని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బీసీ విద్యార్థులకు హాస్టల్ వసతి కూడా ఉందని తెలిపారు.

ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులకు, వాలంటీర్లకు అవార్డులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎంఆర్ఎ కళాశాలకు చెందిన ఎన్.ఎస్.ఎస్ వలంటీర్ జి. హరీష్ కు యూనివర్శిటి స్థాయి ఉత్తమ జాతీయ సేవా పథకం వాలంటీరు అవార్డు, డాక్టర్ పిఎన్‌బి శర్మకు జిల్లా స్థాయి ఉత్తమ జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి అవార్డు, డాక్టర్ జి. చంద్ర శేఖర రావుకు ఉత్తమ ఎన్.ఎస్.ఎస్ జిల్లా నోడల్ అధికారి అవార్డులు లభించాయి. జాతీయ సేవా పథకంలో గ్రామ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు చేసిన సేవలకు గాను, ఈ అవార్డులను ఆంధ్రా విశ్వ విద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్. జి.పి. రాజశేఖర్ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అందజేసారు. ఈ సందర్బంగా కళాశాల లో అవార్డు గ్రహీతలకు అభినందన సభ ఏర్పాటు చేసారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు మాట్లాడుతూ ఎన్ఎస్-ఎస్ వలంటీర్లు రక్త దానం చేయడం, వైద్య శిబిరాలలో పాల్గొనడం, జాతీయ సమైఖ్యత శిబిరంలో పాల్గొనడం వలన ఈ అవార్డులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఎయు ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త డి.సింహాచలం, ఎయు విద్యార్థి విభాగం డీన్ ప్రొఫెసర్ ఎస్ హరనాథ్, విశాఖ డిఎన్ఒ ఇపిఎస్ భాగ్యలక్ష్మి, ఎన్ఎస్-ఎస్ పిఒ చిన్నంనాయుడు పాల్గొన్నారు .

పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఐటిఐ విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం ప్రభుత్వ ఐటిఐలో చదువుకొని జాబ్‌మేళాల్లో పలు కంపెనీల్లో ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు మంగళవారం కళాశాలలో ప్రిన్సిపల్ టివి గిరి ఆధ్వర్యాన వీడ్కోలు పలికారు. మే 27న జరిగిన మెగా జాబ్ మేళాలో హైదరాబాదక్షలని భగవతి ప్రొడక్ట్, క్యూసి టెక్నాలజీ, జయభేరిలో ఎంపికైన 96మంది విద్యార్థులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమిత్వా సర్వే పరిశీలన

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలోని పినతాడ పంచాయతీలో జరుగుతున్న సమిత్వా సర్వేను జిల్లా పంచాయతీ అధికారి డి.మల్లికార్జునరావు మంగళవారం పరిశీలించారు. 25వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. మండలంలో సమిత్వా జరుగు 18 గ్రామాల్లో అదే తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. అనంతరం పినతాడ గ్రామంలో పారిశుధ్య పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - మెంటాడ

వర్షాలు కురుస్తున్న ఈ కాలంలో గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి జి. కల్పన సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో శుభ్రత, పారిశుధ్యం ముఖ్యపాత్ర పోషిస్తాయని ఆమె స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎక్కడా నిల్వ నీరు లేకుండా చర్యలు తీసుకోవాలని, దోమల వ్యాప్తి నివారణకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఆదేశాలు జారీ చేశారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా జ్వరాలు, వైరల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామాల్లో పరిశుభ్రత పనులను స్వయంగా మంగళవారం పరిశీలించారు. ప్రజల సహకారంతోనే మాత్రమే వ్యాధులను అరికట్టగలమని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ సత్యనారాయణ హెచ్‌వి జ్యోతి ఎఎన్‌ఎం పార్వతి, ఆశా వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల రద్దు దుర్మార్గం

ప్రజాశక్తి - జామి

పేదల పింఛన్ల రద్దును పూనుకున్న కూటమి ప్రభుత్వ చర్యలు దుర్మార్గమని వైసిపి మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ మండలంలో వందల సంఖ్యలో వికలాంగ పింఛన్లు తొలగించడం సరియైన పద్ధతి కాదన్నారు. గత ప్రభుత్వంలో వైద్య బృందాలు ధ్రువీకరించిన సదరం సర్టిఫికెట్లు ఆధారంగానే అప్పటి జగన్ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటి వరకు పింఛన్ల డబ్బుతో బతుకుతున్న వందలాది లబ్ధిదారులు తీవ్ర ఆందోళన చెందుతున్న విషయాన్ని ప్రభుత్వం అర్థం చేసుకోవాలని చూసించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సరయు, ఎంపిపి సబ్బవరపు అరుణ, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, పించనదార్లు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల్లో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మహిళా పోలీసులు జకరగబోయే గణేష్ ఉత్సవాల్లో అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ బి.గణేష్ సూచించారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎంఎస్‌పిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల్లో ఎంఎస్‌పిలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసే ప్రతి వినాయక మండపానికీ మైక్ పర్మిషన్ తీసుకోవాలన్నారు. ఏదైనా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసే ముందు పోలీస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. కాగా ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా పెద్ద పెద్ద శబ్దాలతో డీజే బాక్సులు పెట్టి ఊరేగించడం, మందు గుండు కాల్చడం పూర్తిగా నిషేధమన్నారు. ఈ విషయాలను గ్రామాల్లో గల వినాయక మండపాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పిలు పాల్గొన్నారు.

టీకా కార్యక్రమం పరిశీలన

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని పెద్దమజ్జిపాలెం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం పరిధిలోని తాటిపూడి గిరిజన ఆశ్రమ పాఠశాలలోని మంగళవారం జరిగిన వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమాన్ని జిల్లా వ్యాధి నిరోధిక అధికారిని డాక్టర్ అచ్యుత్ కుమారి పరిశీలించారు. 10 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల పిల్లలకు ధనుర్వాతావ రాకుండా నివారణ కోసం టీకాలు వేస్తున్నట్లు ఆమె తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 23వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఆసుపత్రి పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఈ టీకాలను వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఈశ్వర్ రావు, రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు గొడుగులు పంపిణీ

ప్రజాశక్తి- డెంకాడ

ప్రతి విద్యార్థి ఆలోచనతో ముందుకు సాగినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఐహెచ్‌ఆర్‌సి రాష్ట్ర అధ్యక్షులు జి.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షులు అచ్చిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మంగళవారం జిల్లా సెక్రెటరీ ఎస్‌పి నాయుడు నేతృత్వంలో డెంకాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సుమారు 50 మందికి గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించినట్లయితే ఉన్నత శిఖరాలకు చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ఎటువంటి మాదక ద్రవ్యాలకూ, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు చెప్పే మంచిని గ్రహించి, ఆటల్లో పాటల్లో క్రమశిక్షణలో ముందుకు సాగాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో డెంకాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఐహెచ్‌ఆర్‌సి రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు, రమణ, డెంకాడ యువకులు రఘు, రొంగలి జగన్, బొంతు అప్పారావు, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జిల్లా కేంద్రంలో కేన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని నెల్లిమర్ల నియోజకవర్గం బిజెపి కన్వీనర్ బూర్లే శ్రీధర్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంతోమంది కేన్సర్‌తో బాధ పడి ఇతర ప్రాంతాలకు చికిత్స కోసం వెళ్తున్న వారున్నారన్నాఉ. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం మహారాజా సర్వజన ఆసుపత్రిని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు తరలించి కేన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేయాలన్నారు. సర్వజన ఆసుపత్రికి రోజుకి 1500 నుంచి 1600మంది రోగులు వస్తున్నారని బెడ్లు చాలడం లేదన్నారు. ఇటీవల కాలంలో కేన్సర్ రోగం ఎక్కువగా ప్రభలి ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకున్నారన్నారు. కాగా తినే ఆహారం లో విషతుల్యం, రసాయన పదార్దాలు ఉండడం, మనం పండించే పంటలో అధిక మొత్తం లో రసాయన ఎరువులు వినియోగించడం కేన్సర్ రోగాలకు కారణం అవుతుందన్నారు.

చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలాలైనా శ్మశాన వాటికను, కోనేరు చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడంతోపాటు రెండు కోనేర్ల మధ్య గట్టును ఇరిగేషన్ అనుమతులు లేకుండా సీసీ రోడ్డు నిర్మించుకుని ప్రభుత్వ ధనాన్ని దోచేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గొర్రెల శ్రీనివాసరావు, ఎం.సురేష్, కెవి సత్యనారాయణ, ఎం.శివ, బి.సత్యనారాయణ, నాగిరెడ్డి సింహాచలనాయుడు, కిమిడి అప్పారావు, గుడివాడ సూరిబాబు, గొర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులు చురుగ్గా ఉండాలి

ప్రజాశక్తి - గంట్యాడ

ప్రతి విషయంలోనూ ప్రజలు సమస్యలను తెలుసుకోవడానికి ప్రజాప్రతినిధులు చురుగ్గా ఉండాలని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి పీరుబండి హైమావతి అధ్యక్షత మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని పలు సమస్యల పైన దృష్టి పెట్టి సంబంధిత అధికారులు దృష్టికి తీసుకురావడానికి చురుగ్గా పని చేయాలన్నారు. పలు శాఖల అధికారులు ఆ శాఖలపై తెలిసిన విషయాలను గ్రామంలో మౌనం పాటించకుండా సమాధానం చెప్పాలన్నారు. అప్పుడే అధికారులు ప్రజలపై బాధ్యత పెరుగుతుందన్నారు. వివిధ శాఖల అధికారులు ప్రతి విషయాన్ని కూలంకుషంగా వివరిస్తున్నారని దీన్ని బట్టి ప్రజాప్రతినిధులలో లోపం ఉన్నట్లు కనిపిస్తుందని ప్రతి ఒక్కరూ పద్ధతిని మార్చుకోవాలని మండల జరిగే సమావేశానికి తప్పనిసరిగా హాజరు అవుతానని అప్పటికి అందరూ ఉత్సాహంగా ఉండాలని చెప్పారు. గ్రామ పంచాయతీలలోని పారిశుధ్యం తొలగించడానికి నిధులను అందజేస్తానని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారని తద్వారా అందజేస్తారని గుర్తు చేశారు. ఎపిసి చైర్మన్ గోపాల రాజు మాట్లాడుతూ ప్రతి రాజకీయాలకు ఎటువంటి సంబంధం లేదని అందరం కలిసి ప్రజా సమస్యలపై పనిచేయాలన్నారు. కొంతమంది ఎంపిటిసిలు, సర్పంచులు అతి ముఖ్యమైన సర్వసభ్య సమావేశానికి హాజరు కాకపోవడం బాధాకరంగా ఉందన్నారు. దీని వల్ల ప్రజా సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. మండలంలోని నాలుగు పిఎసిఎస్ ఉన్నాయని వాటి అభివృద్ధికి కృషి చేస్తానని రైతులకు అండగా నిలుస్తానని పిఎసిఎస్ అధ్యక్షులు ప్రతి విషయాన్ని తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపిపి పీరుబండి హైమావతి మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని పారిశుధ్య పనులను చేపట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని పరిశుభ్రమైన తాగు నీరును అందించాలని, రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి వర్రి నరసింహమూర్తి, ఎంపిడిఓ ఆర్‌ఆర్ రమణమూర్తి, తహశీల్దార్ నీలకంఠేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు



నాయుడును సత్కరిస్తున్న అధ్యాపకులు

ఉత్తమ డైట్ లెక్చరర్‌కు సత్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయ విద్య శిక్షణ సంస్థ (డైట్)లో ఫిలాసఫీ లెక్చరర్‌గా ఉన్న చావలి శేషాద్రీనాయుడును మంగళవారం ఘనంగా సత్కరించారు. అధ్యాపకులుగా విద్యా రంగం, విద్యార్థులకు సేవలు అందించినందుకు ఉత్తమ అధ్యాపకులుగా జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను ప్రిన్సిపాల్ కె. రామకృష్ణారావు చేతులు మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ డి.అప్పల నాయుడు, స్టాఫ్ సెక్రటరీ వి.చిన్నం నాయుడు, అధ్యాపకులు,చాత్రోపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఉద్యోగులపై కమిషనర్ ఆగ్రహం

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ ఇంజినీరింగ్ ఉద్యోగులు పనితీరుపై మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని, తాగునీరు సరఫరా జరుగుతున్న సమయంలో వార్డులో తాగునీటి సరఫరా తీరును పరిశీలించాలని కోరినప్పటికీ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెండింగ్ పనులు పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు. తాగునీరు సరఫరాను పరిశీలించి లీకులను గుర్తించి నివారించాలన్నారు. సమావేశంలో డిఇ కిరణ్ కుమార్, ఏఇలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మల్లమ్మపేటలో పారిశుద్ధ్య పనులు పరిశీలన

మల్లమ్మపేటలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలువలలో నీరు సక్రమంగా వెళ్లేలా చూడాలని ఆదేశించారు. కాలువ పక్కన రోడ్డుపై మట్టిదిబ్బలను తొలగించాలని ఆదేశించారు. వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రామలక్ష్మి

పింఛన్ల పునరుద్ధరణకు దరఖాస్తులు

ప్రజాశక్తి- మెంటాడ

వికలాంగుల పింఛన్ల పునరుద్ధరణకు తమ సర్టిఫికెట్లను మరోసారి పునఃపరిశీలించుకునేందుకు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ భానుమూర్తి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పింఛను రద్దు, రకం మార్పుతో నోటీసు పొందిన వారు ఏదైనా అప్పీల్ చేసుకోవాలనుకుంటే ఎంపిడిఒ కార్యాలయంలో అప్పీల్ కోరుతూ ఎంపిడిఒకు ఆర్జీతోపాటు ఆధార్ కార్డు జిరాక్స్, పెన్షన్ రద్దు, పెన్షన్ మార్పుకు సంబంధించి లబ్ధిదారులు అందుకున్న నోటీసు, పాత సదరం సర్టిఫికేటు, కొత్త సదరం సర్టిఫికేట్టుతోపాటు పెన్షన్ దారునికి సంబంధించిన ఏవైనా హాస్పిటల్లో చికిత్స పొందిన, పొందుతున్న డాక్యుమెంట్స్ ఉంటే జతపరచాలన్నారు. మండలంలో వికలాంగుల పింఛన్లు రీ వెరిఫికేషన్‌లో భాగంగా సుమారుగా 250 పింఛను రద్దు చేస్తున్నట్లు గ్రామ సచివాలయాలకు తాఖీదులు వచ్చాయన్నారు. వీటి పునః పరిశీలనకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

శృంగవరపుకోట: వికలాంగుల పింఛన్ల అప్పీల్ ప్రక్రియకు అనర్హులుగా నోటీసు అందుకున్న వారు పింఛను ఆగిపోతుందేమోనని భయపడనవసరం లేదని ఎంపిడిఒ సతీష్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వికలాంగులు పింఛన్‌కు అనర్హులుగా నోటీసు అందుకున్న తాము అర్హులమని భావించినట్లయితే మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో తనను సంప్రదించి, తమ అర్జీని సమర్పించవచ్చుని, అధికారులు మీ అర్జీని పెన్షన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి, తదుపరి కార్యాచరణ జరిపి షెడ్యూల్ ప్రకారం, మిమ్మల్ని ఆసుపత్రికి హాజరుకావాలని కోరుతూ మరో నోటీసు జారీ చేస్తారని చెప్పారు.

ఎక్కడ, ఎప్పుడు అనే వివరాలను నోటీసు ద్వారా మీకు తెలియజేస్తారని ఆయన అన్నారు.

గతాలను గుర్తు చేసేదే ఫొటోగ్రఫీ

ప్రజాశక్తి - చీపురుపల్లి

చిన్నతనం నుండి మరిచిపోయిన ఎన్నో గతాలను గుర్తు చేయడంలో ఫోటోగ్రఫీ కీలకపాత్ర పోషిస్తుందని స్థానిక సిఐ జి.శంకర్రావు అన్నారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ సందర్భంగా నియోజకవర్గంలోని సీనియర్ ఫోటోగ్రాఫర్ మల్లింపూడి నర్సింగరావును మంగళవారం తన కార్యాలయంలో సత్కరించి పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛాయాచిత్రాలు తీయడం అనేది దేవుడిచ్చిన వరంగా భావించాలన్నారు. తమకు గుర్తులేని ఎన్నో గతాలను ఫోటోల ద్వారా ఫోటోగ్రాఫర్లు తమ సేవలను అందజేస్తూ గుర్తు చేస్తారన్నారు. ఎప్పుడో జరిగిన సన్నివేశాలను కూడా కళ్ళకు అద్దినట్టు ఫోటోలు తీయడంలో ఫోటోగ్రాఫర్ల నైపుణ్యం చాలా ప్రధానమైందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫోటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: పట్టణంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సూపరింటెండెంట్ జి.శశిభూషణరావు చేతులమీదుగా పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం లోకబందు రెసిడెన్సీ వరకు ర్యాలీ చేసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఫోటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎ. సన్యాసిరావు, అధ్యక్ష, కార్యదర్శుల రంగా, రాజన్, రవిశంకర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరు అరెస్ట్

కంటోన్మెంట్: పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా సూర్య లాడ్జి సమీపంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు విజయనగరం వన్ టౌన్ సిఐ ఆర్ వి ఆర్ కె చౌదరి తెలిపారు. సోమవారం విజయనగరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒరిస్సా రాష్ట్రం మనుగడకు చెందిన రాయిదాసు గంట, అంతరామి మల్లిక్ అనే ఇద్దరు ఒరిస్సా నుంచి తమిళనాడులోని తిరువూరుకు పది కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. విజయనగరం రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న సూర్య లాడ్జి సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించమన్నారు. ఈ సమావేశంలో వన్ టౌన్ ఎస్ఐ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి మృతి

కంటోన్మెంట్: చీపురుపల్లి రేల్వే స్టేషన్ సమీపంలో ఒక ఇంట్లో రుద్రరాజు రామరాజు మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం, చిన్నరాజాపురం గ్రామానికి చెందిన రామరాజు రైల్వే స్టేషన్ సమీపంలో వంతెన పనులు నిమిత్తం గతేడాదిగా ఇక్కడే ఉన్నాడు. మూడు రోజులు నుంచి పనికి వెళ్లకుండా గదిలోనే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో రూమ్‌లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కారణాలు తెలియాల్సి ఉంది.

ట్యాంకర్‌ను ఢీ కొన్న ఆర్‌టిసి బస్సు

పలువురికి స్వల్ప గాయాలు

పూసపాటిరేగ: మండలంలోని పేరాపురం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని శ్రీకాకుళం నుండి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు మంగళవారం వెనుక నుండి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రయాణికులకు స్వల్ప గాయాలు అవడంతో సమీపంలో ఉన్న సుందర పేట ఆసుపత్రికి తరలించారు. అదపాక బంగారమ్మ అనే ప్రయాణికురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. ఆర్‌టిసి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవ్ చేయడం వల్లనే ప్రమాదం జరిగినట్లు ఎస్సై తెలిపారు.

విద్యారంగ సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా

ప్రజాశక్తి- శృంగవరపుకోట:

ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఎస్‌కోటలో విద్యార్థులతో నిర్వహిస్తున్న ర్యాలీని పోలీసులు సెక్షన్ 30 పేరుతో అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులు ర్యాలీ ఆపి కొంతమంది విద్యార్థులు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు కలసి తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు వి.భారతి మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్య దేశమా అప్రజాస్వామ్య దేశమా సమస్యలు అడగడానికి వెళ్తుంటే అరెస్టు చేస్తామని విద్యార్థులను బెదిరించడం సరైంది కాదన్నారు. ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో భాగంగా వచ్చిన నారా లోకేష్ తాము అధికారంలోకి రాగానే విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని విద్యాశాఖ మంత్రిగా పదవిలోకి వచ్చి సంవత్సరం దాటినా ఇంకా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాకపోవడం సిగ్గుచేటు అని వీటిపైన విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తుండగా పోలీస్ వారిని ఉపయోగించి సెక్షన్ 30 పేరు చెప్పుకుంటూ అణచి వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి పెండింగ్‌లో ఉన్న 6,400 కోట్లు బకాయిలను విడుదల చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు ఆర్. రత్న, మండల కమిటీ సభ్యులు చరణ్, మహేష్, అనితా, నాని, శంకర్, సాయికిరణ్, కిరణ్, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఘనంగా నాగార్జున జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

టిడిపి జిల్లా అధ్యక్షులు, డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను నాగార్జున కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయనను బొబ్బిలి ఎమ్మెల్యే కలసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. నాగార్జున మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ రైతులకు ప్రజలకు నాణ్యమైన సేవలందిస్తానన్నారు. ఈ వేడుకల్లో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నెల్లిమర్ల నియోజకవర్గ సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, కంది చంద్రశేఖర్, గేదెల రాజారావు, కడగల ఆనంద్, విజయనగరం పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, చనుమల మహేశ్వరావు, కంది మురళి నాయుడు, పిఎసిఎస్‌ల చైర్మన్‌లు నానిరాజు, కృష్ణం రాజు, పిళ్ళా అప్పల నాయుడు, మండల అప్పల నాయుడు, దుర్గాసి కోటేశ్వరరావు,తాడ్డి శ్రీనివాస్,రెడ్డి లక్ష్మణ రావు, మీసాల కాశీ, వాసు,నాగులపల్లి నారాయణ రావు తదితరులు పాల్గొని నాగార్జున కు శుభాకాంక్షలు తెలిపారు.

పేదల పక్షాన నిలబడే నాయకుడు నాగార్జున

చీపురుపల్లి : గత ఏడు సంవత్సరాలుగా పేదల పక్షాన నిలబడి పేదలకు న్యాయం జరిగే వరకు పోరాడిన నాయకుడు ఉమ్మడి జిల్లాల డిసిసిబి అధ్యక్షులు, జిల్లా టిడిపి అధ్యక్షులు కిమిడి నాగార్జున అని పలువురు కొనియాడారు. నాగార్జున జన్మదినాన్నీ పురస్కరించుకొని కిమిడి మిత్రమండలి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మంగళవారం భోజనాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోనే జిల్లాలో ప్రజలకు ఎక్కడ ఏ సమస్య ఉన్న తానున్నానంటూ అండగా నిలవడం నాగార్జున నైజమనీ వారు అన్నారు. పేద ప్రజల తరుపున పోరాటం చేసే నాయకుడిగా కిమిడి నాగార్జునకు నియోజకవర్గంలో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. పార్టీ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కిమిడి మిత్రమండలి సభ్యులు రవి, ప్రసాద్, మానవీతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు బీవీ గోవిందరాజులు, కానూరు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే బేబినాయన, నాయకులు

డెంకాడ: డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జునకు జిల్లా డిసిసిబి బ్యాంక్‌లో మంగళవారం టిడిపి నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు, పల్లె భాస్కర్‌రావు, సురేష్, కొర్నాన ఆదిబాబు, సింగవరం సర్పంచ్ పిట్ట అప్పారావు, బొండా రవి కిరణ్, ఎఎంసి డైరెక్టర్ మోపాడ శ్రీనివాసరావు, లెంక అప్పలనాయుడు, పైల అప్పలనాయుడు, పైల మోహన్, భాస్కర్ రావు, కలిశెట్టి త్రినాథ్, లెంక మాధవ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పారా జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పారా జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి జిల్లా కీర్తి ప్రతిష్టలను మరింతగా పెంచాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ అన్నారు. మంగళవారం మండలంలోని కోనాడ జంక్షన్ వద్ద సాయి కొరియన్ క్యాంపస్ ఛాలెంజ్ స్కూల్‌లో జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆటగాళ్లను అభినందించారు. ఆగస్టు 9న విశాఖపట్నంలో జరిగిన పారా రాష్ట్రస్థాయి జూనియర్, సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన 47 మంది క్రీడాకారులు పాల్గొనగా, అందులో 13 మంది క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి జాతీయ పోటీలకు ఎంపిక అయ్యారని తెలిపారు. వీరిలో సాయి కొరియన్ క్యాంపస్ ఛాలెంజ్ స్కూల్‌కు చెందిన ఓళ్ల రామ్ చరణ్ తేజ (లాంగ్ జంప్), కొంతల సోములమ్మ షాట్‌పుట్, 100మీ, 400 మీ పరుగులలో ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ప్రత్యేకంగా అభినందనీయమని దయానంద్ అన్నారు. ఈ నెల 29 నుండి 31 వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ వేదికగా జరగనున్న 15వ పారా జూనియర్ అండ్ సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ 2025లో ఈ క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఛాలెంజ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ శర్మ, ప్రిన్సిపాల్ గాయత్రి, కోచ్ గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

మహారాజశ్రీ రాజాం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
S.O.P. 2/2025

పిటిషనర్ : పాలవలస దుర్గారావు
రెస్పాండెంట్ : నిల్

జనరల్ పబ్లిక్ నోటీసు

పై తెలియ చేసిన పిటిషనరు చనిపోయిన ఉండ్రాల్ల క్రిష్ణవేణికి వారసుడుగా నిర్ణయిస్తూ వారసత్వపు సర్టిఫికేటు (Succession Certificate) యిప్పించకోరుచూ దాఖలు చేసిన పై నెంబరు పిటిషను **తే 28-8-2025దీని** వాయిదా ఉన్నందున ఏవ్వరికి ఎట్టి ఆక్షేపణలు ఉన్నయెడల తే 28-8-2025దీ ఉదయం పై కోర్టువారి ఎదుట హాజరై మీకున్న ఆక్షేపణలు తెలియపర్చుకోగలరని యీ ప్రకటన మూలంగా తెలియపర్చడమైనది.

ఎం.చిరంజీవ రావు నాయుడు
న్యాయవాది,
పిటిషనరు తరపు న్యాయవాది,
రాజాం-532127,
విజయనగరం జిల్లా.
తేది.19.08.2025
రాజాం.

PUBLIC NOTICE

నా క్లయింట్ అయినటువంటి శ్రీ దాచేపల్లి రవికాంత్ S/o లేటు మోహన్‌బాబు ఇంటి నెం. 2-1-16, హజీషరీఫ్ వీధి (వైష్ణవ వీధి) విజయనగరం వారు ఇచ్చిన సమాచారం ప్రకారం కోర్టు పని మీద వారి ఇంటినుండి బస్సుస్టాండ్‌కి వెళ్ళే దారిలో నా క్లయింట్ యొక్క బ్యాగ్‌లో సంతకములు చేసిన వొకాలత్ పేపర్స్ (Vakalat Papers) సంతకములు పెట్టిన ఖాళీ పేపర్లు మరియు నా క్లయింట్ యొక్క Bank FDలు బ్యాగ్ పోయినది. కావున పైన తెలిపిన సంతకములు చేసిన వొకాలత్ పేపర్లు మరియు సంతకములు చేసిన ఖాళీ వైట్ పేపర్లు, Bank FDలు బ్యాగ్ ఎవరికైన దొరికిన క్రింది అడ్రసు వారికి సమాచారము ఇవ్వగలరని పైన తెలిపిన పేపర్లు ద్వారా ఎవరైనా ఎటువంటి వ్యవహారములు జరిపిన అవి చెల్లుబాటు కావని మరియు నా క్లయింటుకు బందించ జాలదని ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయుచున్నాము.

Kalisetty Eswara Rao
Advocate, Viziangaam
Cell: 9440836875

నోటీసు
మహారాజశ్రీ గజపతినగరం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)
E.P.37/19 OS 13/18

పొడిపిరెడ్డి కన్నం నాయుడు ....DHr
రెడ్డి సోములు వగైరాలు ......JDrs

JDr No.3
శిరిపురపు సోములమ్మ

JDr No.4
కుపిరెడ్డి సింహాచలం

పై నెంబరు అమలులో మీ ఇరువురును చనిపోయిన JDr No.1 రెడ్డి సోములు వారసులుగా చేర్చుటకు పిటిషన్ దాఖలు చేసియున్నందున, అందు మీకు ఆక్షేపణలు వున్న ఎడల మీరు స్వయంగా గాని వకీలు ద్వారా గాని సదరు కోర్టులో **తే 29-8-2025ది ఉ॥ 10-30గం॥లకు** హాజరై మీ వాదనలు దాఖలు చేసుకొనవలెను. అట్లు కానిచో మీపై పరోక్షంగా ఉత్తర్వులు ఇవ్వబడును.

తొత్తడి దేవుడు
పిటిషనరు న్యాయవాది
గజపతినగరం
గజపతినగరం
తేది: 19-8-2025

బహిరంగ ప్రకటన
శ్రీ మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు రాజాం, వారి కోర్టులో
ఎస్.ఒ.పి నెం. 3/2025

1. గుడ్ల వెంకట గోవిందరావు
2. గుడ్ల నాగరాజు (Mental Retardation severe next fried his brother acting as a guardian Gudla Venkata Govindarao) ......పిటిషనర్స్
కందుల పద్మ ....రెస్పాండెంట్

విషయం- వారసత్వపు పింఛను గురించి

పై నెంబరు ఎస్.ఒ.పి నె.3/2025లో శ్రీ గుడ్ల లేటు ఉగాది గారు 17.07.2012 దిన కాలం చేసియున్నారు. ఆయన తదనాంతరం ఆయన యొక్క పింఛనను ఆయన భార్య శ్రీమతి గుడ్ల రూపవతి గారు తీసుకున్నారు. శ్రీమతి రూపవతి గారు తే.13.06.2024దిన కాలం చేసినారు. శ్రీ ఉగాది గారు మరియు అతని భార్య రూపవతి గారికి ముగ్గురు సంతానం 1. గుడ్ల వెంకటగోవిందరావు 2. గుడ్ల నాగరాజు, 3. కందుల పద్మ కలరు. వారిలో గుడ్ల వెంకట గోవిందరావు మరియు కందుల పద్మ గారికి వివాహములు జరిగియున్నవి. గుడ్ల నాగరాజుకు మానసిక రుగ్మతలతో కూడిన అనారోగ్యములతో ఉండగా శ్రీ ప్రభుత్వం డాక్టర్లు గుడ్ల నాగరాజుకు 90 శాతం అంగవైకల్యం కూడిన ధృవీకరణ పత్రం ఇచ్చియున్నారు. పైన పేర్కొన్న గుడ్ల ఉగాది గారు మరియు రూపవతి గార్ల పింఛను ఆ కుటుంబంలో ఎటువంటి ఆదాయం లేని వ్యక్తులకు ఇచ్చుటకు శ్రీ ప్రభుత్వం వారు మంజూరు చేసియున్నారు. ఈ విషయమై ఆ పింఛన్లు తీసుకొనుటకు వారసత్వపు పత్రం (సక్సెసన్ సర్టిఫికేట్) అవసరమై ఉన్నందున శ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో పై నెంబరుగల ఎస్.ఒ.పి దాఖలు చేసియున్నారు. ఈ విషయమై శ్రీ కోర్టువారు ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్న వారు వ్యక్తిగతముగా గానీ వకీలు గారి ద్వారా గాని **తే.18.09.2025 దిన ఉదయం 10-30 గం॥లకు** శ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి ఎదుట హాజరై వారి ఆక్షేపణలు తెలియపరచవలెను. లేనిచో పై పిటిషనర్లకు అనుకూలంగా అవసరమైన ఆర్డర్లు జారీ చేయడం జరుగునని యిందుమూలముగా తెలియపరచడమైనది.

అల్లెన సత్యన్నారాయణ,
సెల్ నెం. 9949176936,
వంజరాపు జితేంద్రకుమార్,
సెల్ నెం.6300380570,
న్యాయవాదులు, రాజాం.
తేది. 20.08.2025
రాజాం.